క్లుప్తంగా

వేడుకగా ఆలయ వార్షికోత్సవం



దేవలో బాల పార్వతీదేవి చంద్రశేఖర స్వామి వార్ల ఆలయ తృతీయ వార్షికోత్సవం

పెనుగొండ: దేవలోని బాల పార్వతీ దేవి చంద్రశేఖర స్వామి ఆలయ తృతీయ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వేద పండితులు అచ్యుతరామారావు, పవన్‌కుమార్ పర్యవేక్షణలో లిచేటి బాబూ రాజేంద్రప్రసాద్, వరలక్ష్మీ, వెలిచేటి లక్ష్మీ, వెంకటశ్రీనివాస్ లీల కల్యాణితో హోమాలు, దివ్యాభిషేకాలు, లక్ష కుంకుమార్చనలు భక్తి శ్రద్ధతలో నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భారీ అన్న సమారాధన నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనగా, ఆలయ కార్యనిర్వహణాధికారి ఆర్‌వీవీఎస్ రామచంద్రరావు ఏర్పాట్లు చేశారు.

ముమ్మరంగా పంట బోదెలో పూడికతీత పనులు



కేపీపాలెం సౌత్‌లో పంట బోదె తవ్వుతున్న ఉపాధి కూలీలు

మొగల్తూరు: మండలంలోని పలు గ్రామాల్లో పంట బోదె తవ్వకం పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. కాలువలు వదలడంతో ప్రతి శివారు ప్రాంతానికి సాగు నీరందాలనే ఉద్దేశ్యంతో పంట బోదె తవ్వకం పనులు చేపట్టారు. మండలంలోని కేపీపాలెం సౌత్, నార్త్, మొగల్తూరు పంచాయతీలోని పాలకమ్మ చెరువు, నక్కావారిపాలెం, పడమటిపాలెం తదతర ప్రాంతాల్లో శుక్రవారం పంట బోదె తవ్వకం పనులు ప్రారంభించారు. దాళ్వా సాగుకు సంబంధించి ప్రతి ఎకరాకు సాగు నీరందించినట్లుగానే సార్వా సాగుకు ప్రతి శివారు భూములకు నీరందించేందుకు పంట బోదెల తవ్వకం చేపట్టామని టీపీ వెంకటేశ్వరరావు తెలిపారు.

29న జాతీయ లోక్ అదాలత్



10వ అదనపు జిల్లా జడ్జి విజయదుర్గ

నరసాపురం: నరసాపురం కోర్టు ఆవరణలో ఈనెల 29న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్టు మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, 10వ అదనపు జిల్లా జడ్జి పి.విజయదుర్గ చెప్పారు. అధాలత్‌లో కేసులు రాజీ చేసుకోవడం ద్వారా సమయం, డబ్బు ఆదా అవుదాయని చెప్పారు. రాజీచేసుకోదగ్గ సివిల్, క్రిమినల్ అన్ని కేసులు పరిష్కరించుకోవచ్చని చెప్పారు. న్యాయవాదులు, పోలీసులు సహకరించి వీలైనన్ని ఎక్కువ కేసులు పరిష్కరించుకునే విధంగా కక్షిదారులకు అవగాహన కల్పించాలని కోరారు.

చేగువేరా ఆశయ సాధనకు యువత కృషి చేయాలి

తణుకు: ప్రపంచ విప్లవకారుడు చేగువేరా అనీ.. యువత చేగువేరా ఆశయాలు, స్ఫూర్తితో కొనసాగాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు అన్నారు. చేగువేరా 97వ జయంతి సందర్భంగా శుక్రవారం స్థానిక సీపీఐ పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రపంచ మానవాళి విముక్తి కోసం భౌగోళిక సరిహద్దులతో సంబంధం లేకుండా అమెరికన్ సామ్రాజ్యవాద దోపిడీకి వ్యతిరేకంగా ఆఖరి క్షణం వరకు పోరాడిన ధీరుడు కోట్లాది మంది యువత గుండెల్లో నిలిచిన యోధుడు చేగువేరా అని భీమారావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ తణుకు పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి సికిలే పుష్పకుమారి, ఏరియా కన్వీనర్ టి.అప్పలస్వామి, పట్టణ కోశాధికారి గుబ్బల వెంకటేశ్వరరావు, సీపీఐ నాయకులు బొద్దాని మురళీకృష్ణ, బండి సత్యనారాయణ, డేగల హనుమంతరావు, బొద్దాని కృష్ణ కిశోర్, నూనె రాదాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా ఉపాధి పనులు

కాళ్ల: మండలంలో ఉపాధి పనులు చురుగ్గా సాగుతున్నాయి. కాలువల్లోకి నీటిని విడుదల చేయడంతో ఉపాధి హామీ పథకంలో పంట, మురుగు కాలువల్లో తూడు, గుర్రపుడెక్క తొలగింపు పనులు చేస్తున్నారు. మండలంలో ప్రధాన పంట కాలువలు వెంకయ్య వయ్యేరుతోపాటు పంట కాలువలో అభివృద్ధి పనులు చేపట్టారు. దీంతో త్వరితగతిన మంచినీటి చెరువులను నింపుకోవడానికి, సాగుకు నీటి ఇబ్బందులు లేకుండా పూర్తిస్థాయిలో సాగు, తాగునీరు అందేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. మండలంలో 2024 ఏప్రిల్ నుంచి 2025 మార్చి వరకు 223 పనులకు అంచనాలు వేసినట్లు ఉపాధి హామీ అధికారులు తెలిపారు. దీనిలో భాగంగా 4.40 కోట్లతో మండలంలో 21 గ్రామాల్లో ఉన్న పంట మురుగు కాలవల్ల అభివృద్ధి పనులకు ప్రతిపాదనల ద్వారా పనులు చేస్తున్నట్లు టెక్నికల్ అసిస్టెంట్ మణికంఠ శుక్రవారం తెలిపారు. ఇప్పటి వరకు 60 వేల పది దినాలు కల్పించి, రూ.1144 కోట్లు వేతనదారులకు అందించినట్లు ఆయన తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల సందడి



జిన్నూరులో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు



మట్టపర్రులో అంగన్‌వాడీ విద్య పూర్తిచేసిన చిన్నారులకు సర్టిఫికెట్లు ప్రదానం



యలమంచిలి మండలం ఆర్యపేట అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే దృశ్యం



అరట్లకట్ట అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డేలో పాల్గొన్న చిన్నారులు



కొతాలపర్రు అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే దృశ్యం

పోడూరు: 3 ఏళ్లు నిండిన పిల్లలందరినీ అంగన్‌వాడీ సెంటర్లకు పంపించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి.హేమతులసి పిలుపునిచ్చారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో జిన్నూరులో శుక్రవారం అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్ వైజర్ హేమతులసి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల ఎదుగుదలకు అవసరమైన సమగ్రమైన పోషకాహారం అందించడంతో పాటు బాల్యం నుంచే చక్కని నడవడిక, క్రమశిక్షణ అలవడుతాయన్నారు. ఈ నెల 15వ తేదీ వరకు అన్ని అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో అంగన్‌వాడీ పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించడంతో పాటు అంగన్‌వాడీ విద్య పూర్తిచేసుకున్న చిన్నారులకు పట్టాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మెయిన్ పాఠశాల హెచ్‌ఎం వి.జగదీష్, అంగన్‌వాడీ టీచర్లు ఎ.సునీత, ఎస్.విజయపద్మ, కె.ఫణీంద్రకుమారి, ఆర్.సూర్యకుమారి, జి.లక్ష్మీబాయి, ఎల్.ఉషారాణి, పి.రామసీత, వి.లక్ష్మీకుమారి పాల్గొన్నారు.

మట్టపర్రులో శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని అంగన్‌వాడీ టీచర్లు ర్యాలీ నిర్వహిస్తూ 3 ఏళ్లు నిండిన చిన్నాలరును అంగన్‌వాడీలకు పంపించాలని తల్లిదండ్రులకు పిలుపునిచ్చారు. అంగన్‌వాడీ విద్య పూర్తి చేసిన చిన్నారులకు సర్టిఫికేట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ సీహెచ్.ఇందిర, సూపర్‌వైజర్ ఎస్.నాగపద్మ, అంగన్‌వాడీ టీచర్లు ఎ.పద్మావతి, కె.బేబీ, ఎం.మహలక్ష్మి, జె.ఎస్తేరురాణి పాల్గొన్నారు.

ఆర్యపేటలో గ్రాడ్యుయేషన్ డే

యలమంచిలి: మండలంలోని ఆర్యపేట అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ప్రీ స్కూల్ పూర్తి చేసిన చిన్నారులకు ఉత్తీర్ణత పత్రాలు అందజేసి ప్రాథమిక పాఠశాలలో 1వ తరగతిలో చేర్పించారు. అంగన్‌వాడీ సూపర్ వైజర్ మహ్మద్ హసీనా మాట్లాడుతూ 5 ఏళ్లలోపు చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పిస్తే వారికి ఆటలు, పాటలతో పాటు పౌష్టికాహారం అందిస్తామన్నారు. అనంతరం గ్రామంలో అంగన్‌వాడీ పిలుస్తోంది ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఎం రాంబాబు, అంగన్‌వాడీ కార్యకర్తలు జ్యోతి, కల్యాణి, సుమిత్ర, ఆయాలు, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

కొతాలపర్రులో గ్రాడ్యుయేషన్ డే

పెనుగొండ: కొతాలపర్రులో ఐసీడీఎస్ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం గ్రాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహించారు. 2023–24 విద్యా సంవత్సరంలో 5 సంవత్సరాలు పూర్తిచేసుకొని 1వ తరగతిలో చేరుతున్న చిన్నారులకు పీపీ, పీపీ 2 కంప్లీట్ చేసుకొని అర్హత కలిగిన చిన్నారులు గ్రాడ్యుయేషన్ డేలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న సదుపాయాలు వివరించి అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. 3 ఏళ్లు నిండిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించి ప్రభుత్వం అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజరు ఎం.విజయకుమారి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో చిన్నారుల తల్లిదండ్రులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అరట్లకట్టలో గ్రాడ్యుయేషన్ డే

పాలకొల్లు అర్బన్: బాల్య దశలో ప్రత్యేక తరహాలో యూనిఫాం వేసి ఉత్తీర్ణత పత్రాలు అందించడం వల్ల జీవితంలో బాగా చదువుకోవాలనే ఆలోచన ప్రతి చిన్నారి మదిలో కలుగుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పి సత్యవేణి అన్నారు. పాలకొల్లు మండలం అరట్లకట్ట అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం ఐసీడీఎస్ పాలకొల్లు ప్రాజెక్టు సీడీపీవో సీహెచ్ ఇందిర ఆదేశాల మేరకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. కేంద్రంలోని 10 చిన్నారులకు గ్రాడ్యుయేషన్ యూనిఫాం వేసి ఉత్తీర్ణత పత్రాలను అందజేశారు. వీరంతా 1వ తరగతిలో చేరనున్నట్లు సత్యవేణి చెప్పారు. ప్రథమ్ జిల్లా కోఆర్డినేటర్ రమణకుమార్ మాట్లాడుతూ మూడేళ్లు నిండి 5 ఏళ్ల లోపు ప్రతి చిన్నారిని అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించాలని కోరారు. ప్రభుత్వం వీరికి పోషకాహారం అందిస్తుందన్నారు. పాఠశాల హెచ్‌ఎం వి.నరసింహరావు, ఎంఎస్‌కే సునీత, ఏఎన్‌ఎం టి రూపాదేవి, అంగన్‌వాడీ వర్కర్లు కె సత్యవతి, బి లీలాకుమారి, ఎస్ భవాని, ఎస్ సుబ్బలక్ష్మి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో గ్రాడ్యుయేషన్ డే

పాలకొల్లు అర్బన్: పిల్లల సమగ్ర ఎదుగులకు అవసరమైన ఆహారంతో పాటు బాల్యంలోనే మంచి నడవడిక అలవాటు అవ్వాలంటే చిన్నారులందర్నీ అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్ మంగ కోరారు. పాలకొల్లు మండలం దగ్గులూరులో ఐసీడీఎస్ పాలకొల్లు ప్రాజెక్టు సీడీపీవో సీహెచ్ ఇందిర ఆదేశాల మేరకు అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఐదేళ్లలోపు చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని మంగ కోరారు. కేంద్రంలో పౌష్టికాహారంతో పాటు పిల్లలకు ఆట, పాటలతో కూడిన విద్యాబోధన అందించనున్నట్లు వివరించారు. దీనిలో భాగంగా గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. సర్పంచ్ విశ్వనాథం కనకభద్రం, ఎంపీటీసీ శాగ సత్యనారాయణ, హెచ్‌ఎంలు కె శ్రీనివాసరావు, ఎం శ్రీనివాసరావు, ఏఎన్‌ఎం ఎం మార్తమ్మ, ఎంఎస్‌కే ఆర్ హేమశ్రీ, అంగన్‌వాడీ వర్కర్లు ఎం శ్రీదేవి, సీహెచ్ దుర్గ బి ఆశాజ్యోతి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

రక్తదాతల సంఖ్య మరింత పెరగాలి



భీమవరం కలెక్టరేట్‌లో 48 సార్లు రక్తదానం చేసిన కోపల్లి శ్రీనును అభినందిస్తున్న జేసీ ప్రవీణ్ ఆదిత్య

నరసాపురం రూరల్: అత్యవసర పరిస్థితుల్లో ఇప్పటి వరకూ 48 మందికి రక్తదానం చేసిన జిల్లా చిరంజీవి యువత అధ్యక్షుడు కోపల్లి శ్రీనివాస్ ఎందరికో ఆదర్శనీయుడని జాయింట్ కలెక్టర్ ప్రవీణ్ ఆదిత్య అన్నారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని భీమవరం జిల్లా కలెక్టరేట్లో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నరసాపురం మండలం చిట్టవరం గ్రామానికి చెందిన కోపల్లి శ్రీను చిరు పిలుపుతో ఎందరికో రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచాడని పలువురు పేర్కొన్నారు. రక్తం అవసరమైన వారికి సరైన సమయంలో రక్తాన్ని అందించే రక్తదాతల సంఖ్య మరింత పెరగాలని జేసీ ప్రవీణ్ ఆదిత్య ఆకాంక్షభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ చైర్మన్ బదిరి రాజు, సమన్వయకర్త ఎనుమల సతీష్, చెన్నంశెట్టి నాగు పాల్గొన్నారు.

భూ యాజమాన్య హక్కు చట్టం రద్దుపై హర్షం

నరసాపురం: భూ యాజమాన్య హక్కు చట్టం రద్దు చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తీసుకోవడంపై నరసాపురం బార్ అసోసియేషన్ హర్షం వ్యక్తం చేసింది. శుక్రవారం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చల్లా దానయ్యనాయుడు అధ్యక్షతన న్యాయవాదులు సమావేశం నిర్వహించి కేక్ కట్ చేసి హర్షం వ్యక్తం చేశారు. సీనియర్ న్యాయవాదులు కానూరి స్వామినాయుడు, పోలిశెట్టి బాబ్జి, నల్లిమిల్లి జోసఫ్, మోచర్ల సత్యకృష్ణ, పూర్ణిళ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

రక్తదాతలు అభినందనీయులు



యర్రశెట్టి వారిపాలెంలో రక్తదాతలతో ప్రమాణం చేయిస్తున్న వైద్య సిబ్బంది



రక్తదానం చేస్తున్న యువకుడు

నరసాపురం రూరల్: రక్తదాతలు అభినందనీయులని, ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని కాపాడేందుకు దాతలు ఇచ్చిన రక్తం ఎంతగానో దోహదపడుతుందని యర్రంశెట్టివారిపాలెం సర్పంచ్ యర్రంశెట్టి నాగ ముత్యమాంబ అన్నారు. శుక్రవారం నరసాపురం మండలంలోని యర్రశెట్టి వారిపాలెం గ్రామ పంచాయతీ వద్ద ప్రపంచ రక్తదాతల 20వ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ నాగ ముత్యమాంబ మాట్లాడుతూ గర్భిణులకు ప్రసవ సమయంలోనూ, ఆపరేషన్ల సందర్భాల్లో రక్తం చాలా అవసరం అవుతుందన్నారు. డిప్యూటీ డీఎంఅండ్ హెచ్‌వో డాక్టర్ వి.ప్రసాద్ మాట్లాడుతూ మనిషి ప్రాణాలు కాపాడేందుకు ముందుకు వచ్చిన రక్తదాతలు ప్రశంస నీయులన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించి అనంతరం రక్తదాతల నుంచి రక్తం సేకరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అనిల్ కిరణ్‌రమేష్‌రెడ్డి, రెడ్‌క్రాస్ సంస్థ ప్రతినిధి సతీష్, ఏఎన్‌ఎం రత్నమాల, ఎఎంసీ మాజీ వైస్ చైర్‌మెన్ యర్రంశెట్టి బాబులు, ఎంపీటీసీ ఆకన శ్రీదేవి, ఉపసర్పంచ్ తెలగం శెట్టి శ్రీదేవి, గుబ్బల లక్ష్మణ్, తెలగంశెట్టి వాసు, కార్యదర్శి కె రఘురాం పాల్గొన్నారు.

రక్తదానం చేయండి

పాలకొల్లు సెంట్రల్: రక్తదానం చేయడం అంటే ఒకరికి ప్రాణం పోసినట్లేనని తణుకు ,డ్రగ్ ఇన్‌స్పెక్టర్ పి మల్లికార్జునరావు అన్నారు. శుక్రవారం రక్తదాతల దినోత్సవం సందర్భంగా పట్టణంలోని న్యూ లైఫ్ హస్పిటల్‌లో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మల్లికార్జునరావు మాట్లాడుతూ నేటి యువతరం రక్తదానం చేయడంలో పోటీ పడుతున్నారన్నారు. నేడు ప్రమాదంలో ఉన్నవారికి రక్తం అవసరమైతే సోషల్ మీడియా సహకారంతో ఎంతో మంది యువకులు అందుబాటులో ఉంటున్నారన్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చన్నారు. ప్రతి రక్తాన్ని నాలుగు కాంపోనెంట్లుగా విడదీసి నలుగురికి ప్రాణదానం చేయవచ్చన్నారు. ఎంత డబ్బు ఖర్చు పెట్టినా ఒక్క బొట్టు రక్తం కూడా తయారు చేయలేమని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మెడికల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ తటవర్తి కృష్ణమూర్తి, డాక్టర్ కె.ఎస్.పి.ఎస్ వర్మ, వలంటీర్ బ్లడ్ బ్యాంక్ అధినేత ముత్యాల సత్యనారాయణ, ఆసుపత్రి డైరెక్టర్లు అడ్డాల వాసుదేవరావు, పేరిచర్ల గోపాలరాజు, తటవర్తి శారద, అభిషేక్, భూపతిరాజు విశ్వనాధరాజు, బంగార్రాజు, వెంకటపతిరాజు, సీహెచ్ మురళి పాల్గొన్నారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా ఆపద్బంధు బ్లడ్ బ్యాంకులో పది మంది యువకులు రక్తదానం చేశారు.

గోవధకు పాల్పడితే కఠిన చర్యలు



గోవధ నిషేధంపై అవగాహన ర్యాలీలో పాల్గొన్న డాక్టర్ మల్లేశ్వరరావు

పాలకొల్లు సెంట్రల్: గోవధ చట్టరీత్యా నేరమని బక్రీద్ పేరు చెప్పి ఎవరైనా గోవును వధిస్తే కఠిన చర్యలు తప్పవని సహాయ సంచాలకులు, ప్రాంతీయ పశు వైద్యశాల డాక్టర్ జి.మల్లేశ్వరరావు అన్నారు. శుక్రవారం స్థానిక వెటర్నరీ ఆసుపత్రి నుంచి గోవధ నిషేధంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మల్లేశ్వరరావు మాట్లాడుతూ గో వధకు పాల్పడిన, సహకరించిన వారికి కూడా 1962 చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గోవులను, దూడలను ఆడ, మగ ఏదైనా సరే ఉద్దేశపూర్వకంగా వధించకూడదని అన్నారు. మిగిలిన పశువులు ఎద్దు, దున్న, గేదెలు వంటి వాటిని వధించాలంటే వాటి వయస్సు ఖచ్చితంగా 14 సంవత్సరాలు దాటి ఉండాలన్నారు. పశువులు వ్యవసాయానికి, బ్రీడ్ అభివృద్ధికి పూర్తిగా నిరుపయోగంగా ఉన్నాయని ప్రభుత్వం నియమించిన పశు వైద్యులు ధ్రువీకరణ పత్రం ఇవ్వాలన్నారు. ప్రభుత్వ అనుమతి ఉన్న కబేళాల్లో మాత్రమే వధించాలన్నారు. రోడ్లపై, ఇళ్లల్లో ఎక్కడ పడితే అక్కడ వధించి మాంసాన్ని విక్రయించడం చట్టరీత్యా నేరమని అన్నారు. సీఆర్‌పీసీ 43 యాక్టు ప్రకారం ఎప్పుడైనా కాగ్నిజబుల్ నేరం జరిగినప్పుడు ఎవ్వరైనా ప్రైవేటు వ్యక్తి కూడా నేరం చేసిన వ్యక్తిని అరెస్ట్ చేసే హక్కు ఉంటుందన్నారు. గోవధను, గోవుల రవాణాను ప్రతీ పౌరుడు అడ్డుకోవచ్చని, అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేసి వారికి అప్పగించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్‌పీసీఏ సభ్యులు, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



భగ్గేశ్వరంలో డ్రై డే ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్న కారణంగా ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మెడికల్ ఆఫీసర్ డా.సత్యసౌజన్య కోరారు. మండలంలోని భగ్గేశ్వరంలో శుక్రవారం డ్రై డే ర్యాలీ నిర్వహించి వ్యాధులపై అవగాహన కల్పించారు. డా. సత్యసౌజన్య మాట్లాడుతూ మలేరియా, డెంగీ విష జ్వరాలు ఎక్కువగా వచ్చే అవకాశాలున్నాయని సూచించారు. ఇంటి పరిసరాల్లోని పూలకుండీలు, ఫ్రిజ్‌లు, ఎయిర్ కూలర్లు, కొబ్బరి బొండాలు, ప్లాస్టిక్ వస్తువులు, ప్లాస్టిక్ టబ్‌ల్లో నీరు నిలువ లేకుండా చూసుకోవాలన్నారు. వీటిలో దోమల లార్వా పెరిగి దోమలు విజృంభిస్తాయన్నారు. గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య శిబిరం నిర్వహించి రోగులకు వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, పీహెచ్‌ఎన్ పి ఎలిజబెత్, సూపర్ వైజర్లు, ఎంఎల్‌హెచ్‌పీ శ్రావణి, ఏఎన్‌ఎం భారతి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉచితంగా ప్రత్యేక విద్య

తాడేపల్లిగూడెం (టీఓసీ): దివ్యాంగులకు ఉచితంగా ప్రత్యేక విద్యను అందజేస్తున్నామని భవిత సెంటర్ ప్రత్యేక ఉపాధ్యాయులు ఎస్‌కే బాలీశ్వరయ్య అన్నారు. శుక్రవారం పట్టణంలోని భవిత సెంటర్‌లో తల్లిదండ్రులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దివ్యాంగులకు సమగ్ర శిక్ష వారిచే భవిత సెంటర్‌లో వైకల్యాల లోపాన్ని బట్టి సామర్థ్యాలు అభివృద్ధికి అవసరమైన నైపుణ్యాలపై శిక్షణనిస్తున్నట్టు తెలిపారు. పిల్లలతో మమేకమై యోగ, కో కరుక్యులర్ యాక్టివిటీస్‌తో శిక్షణ ఇస్తున్నట్లు వెల్లడించారు. ప్రతి బుధవారం ఫిజియోథెరపిస్ట్ ద్వారా వైకల్యం ఉన్న పిల్లలకు ఫిజియోథెరపీ చేయిస్తున్నామని, మాటలు రాని వారికి స్పీచ్ థెరపీ, అకాడమిక్ స్కిల్స్‌లో భాగంగా రాయడం, చదవడం, అంకెలు, కూడికలు చేయడం, నాణెములను, నోట్లను గుర్తించడం, రంగులను గుర్తించడం, ప్రవర్తన సమస్యలు ఉన్నవారిలో మార్పు తీసుకురావడం, లైఫ్ స్కిల్స్ నేర్పించడం, శారీరక శ్రమ కోసం ఆటలు ఆడించడం, పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు పిల్లలతో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. పాఠశాలలు తెరిచినందున స్కూల్ యూనిఫాం బోధనా సామగ్రి ఉచితంగా అందజేస్తున్నట్లు చెప్పారు. వివిధ రకాల అలవెన్సులు ఉన్నందున దివ్యాంగుల పిల్లల తల్లిదండ్రులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, చదివించాలని, ఇతరుల మీద ఆధారపడకుండా జీవించగలుగుతారన్నారు. ప్రభుత్వ రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అవగాహన కార్యక్రమంలో పిల్లల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

తాడేపల్లిగూడెం (టీటీసీ): ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని మునిసిపల్ కమిషనర్ డి.మురళీకృష్ణ అన్నారు. పట్టణంలో శుక్రవారం స్థానిక టూ టౌన్‌లోని 23వ వార్డు కృష్ణుడు చెరువులో దోమల నిర్మూలనకు ఆయిల్ బాల్స్ వేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజలు తమ ఇళ్ల వద్ద ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రతి రోజు పారిశుద్ధ్య సిబ్బందికి ఇంటిలో తయారైన వ్యర్థాలను అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇనస్పెక్టర్ వెంకటేశ్వరరావు తదితరులు, పారిశుద్ధ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిమ్మలకు జలవనరుల శాఖ కేటాయింపుపై హర్షం

పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడుకు జలవనరుల శాఖ కేటాయించడంతో నియోజకవర్గంలో టీడీపీ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ సంబరాలు జరుపుకున్నారు. శుక్రవారం నిమ్మలకు జలవనరుల శాఖ కేటాయించారు. దానితో పట్టణంలో ఇరిగేషన్ కార్యాలయంలో పార్టీ నాయకులు కాటన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, పెచ్చెట్టి బాబు, గాంధీభగవాన్‌రాజు, కర్నేన గౌరునాయుడు, బోణం నాని, మామిడిశెట్టి పెద్దిరాజు, పీతల శ్రీను, మీసాల రాము, జక్కంపూడి కుమార్, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

విద్యతోనే బంగారు భవిష్యత్

ఉండి: ప్రతి మనిషికి విద్యతోనే బంగారు భవిష్యత్ ఉంటుందని ఉండి లయన్స్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు వేగేశ్న అనంతలక్ష్మీ, కన్నెగంటి రూత్‌కళ అన్నారు. శుక్రవారం ఉండి మెయిన్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యా సామగ్రి పంపిణీ చేశారు. పాఠశాల హెచ్‌ఎం హన్రీటా అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో క్లబ్ ప్రతినిధులు మాట్లాడుతూ విద్య, వైద్య రంగాలు ప్రజల జీవితాల్ని ప్రభావితం చేస్తాయన్నారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభమైన దృష్ట్యా మండలంలోని వివిధ ప్రాంతాల్లో విద్యా సామగ్రి పంపిణీ కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు రుద్రరాజు నరసరాజు, గాదిరాజు రంగరాజు, సత్తి బ్రహ్మారెడ్డి, బీ హరనాథరాజు, కాగిత మహంకాళి, గొట్టుముక్కల రాము, కలిదిండి సీతారామరాజు, నంబూరి కాశీ విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

వైభవంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

ఆకివీడు: సాయిబాబా ఆశీస్సులు తమ గ్రామంపై ఎల్లప్పుడూ ఉంటాయని ఏఎంసీ మాజీ చైర్మన్ వానపల్లి బాబూరావు భక్తి భావం వ్యక్తం చేశారు. మండలంలోని గుమ్ములూరులో వేంచేసియున్న సాయిబాబా ఆలయం 22వ వార్షికోత్సవం శుక్రవారం వైభవోపేతంగా నిర్వహించారు. ఏటా వార్షికోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి గురువారం ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహిస్తామన్నారు. ఆలయంలో సాయిబాబాకు అఖండ పూజలు, హారతులు అందజేశారు. అనంతరం అఖండ అన్నసమారాధనను బాబూరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కమిటీ అధ్యక్షుడు అన్యెం కృష్ణ, మండల యువజన కమిటీ అధ్యక్షుడు చిక్కాల రామాంజనేయులు (చిన్నా), వానపల్లి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు ప్రత్యేక చర్యలు

వీరవాసరం: గ్రామాల్లో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌ఓ మహేశ్వరరావు అన్నారు. స్థానిక పీహెచ్‌సీ పరిధిలో శుక్రవారం నిర్వహించిన డ్రై డే – ఫ్రైడే కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నీరు నిల్వ ఉండే ప్రాంతాల్లో దోమల ఉధృతి ఎక్కువగా ఉండి రోగాలకు కారణమవుతాయని చెప్పారు. తమ పరిసరాల్లో నీరు నిల్ల లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ఖాళీ కొబ్బరి బొండాలు, ట్రాక్టర్, లారీల టైర్లు, రుబ్బురోలు, ప్లాస్టిక్ బాటిళ్లు, నీరు నిల్వ ఉండే పాత సామాన్లు వంటి వాటిని పరిసరాలకు దూరంగా ఉంచుకోవాలని అన్నారు. తొలుత అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మలేరియా నివారణ అధికారి శ్రీనివాసరావు, సీహెచ్‌ఓ దేవదాసు, ఇ.నాగలక్ష్మి, ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏఎంసీ చైర్మన్, పాలకవర్గం రాజీనామా

ఆకివీడు: ప్రజా తీర్పును గౌరవించి, నూతన ప్రభుత్వం ఏర్పడడంతో శుక్రవారం నైతిక బాధ్యతతో ఆకివీడు ఏఎంసీ చైర్మన్ పదవికి రాజీనామా చేసినట్లు చైర్మన్ షేక్ రసూల్‌బీబీ తెలిపారు. తనతోపాటు పాలకవర్గ సభ్యులు కూడా రాజీనామా పత్రాల్ని కార్యదర్శికి అందజేశామన్నారు. చరిత్రలో నిలిచిపోయేలా బీసీ మైనార్టీ మహిళకు ఉన్నత శిఖరం అందించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, పీవీఎల్ నర్సింహరాజుకు నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైసీపీ నాయకుడు హుస్సేన్ పాల్గొన్నారు.